# దొరికిన జవాబు ప్రశ్న

ఆనాడు సాయంత్రం పార్కులో —

'మా' అని ఓపిల్ల ఏడుస్తున్నట్లు వినబడగా వెనుదిరిగి చూశాడు కృష్ణమూర్తి. ఆ పిల్ల నడుస్తూ కిందపడింది. తల్లి పిల్లదగ్గరకు వచ్చి లేవతీసి బట్టలు దులిపి 'అయ్యో పడ్డావా'యని హిందీలో అని ఏదో తినటాని కిచ్చింది. ఆ పిల్ల కొంతసేపు కూనిరాగంతీసి తల్లి గారాబం చేయగా ఊరుకుంది. ఇంతలో తనచుట్టూ తిరిగి చూశాడు. యువక దంపతులు హేళన చేసుకుంటున్నారు; కొంతమంది తమపిల్లలు ఆడుకుంటూంటే చూసి ఆనందిస్తున్నారు. మరొకవైపు ప్రేమికులు తత్తరపడుతూన్న దృష్టులతో ఏమో మాట్లాడుకుంటున్నారు.

అప్పటివరకూ పైళ్ళమధ్య కాపురం చేసి విముక్తి చెందిన కృష్ణమూర్తి పిల్లలు ఆడుకొంటూన్నవైపుకి వెళ్ళి ప్రకృతిని తిలకిస్తూ సేదతీర్చుకుంటున్నాడు. రోజూ సాయంత్రం అతని కిదేపని. ఏరోజు తను ఆపిల్లల్ని చూడకపోయినా ఆరోజు మనస్సంతా ఎలాగో ఉంటుంది. తొందరగా షాపింగుకి వెళ్ళిపోవా లనుకుంటూనే ఆపిల్లల్ని చూస్తూ కూర్చొండిపోయాడు.

'తన రమ ఏం చేస్తూఉంటుందో. తనింటికి వెళ్ళి రెండేళ్ళయింది. ప్రతీ ఏడాది వెళ్ళేవాడు; నిరుటేడాదే వెళ్ళలేకపోయాడు. ప్రస్తుతం బ్రహ్మాండంమీద రెండునెలలు శలవు దొరికింది. ఈసారి వచ్చేటప్పుడు ఎలా నా రమ్మని, తనతో తీసుకురావాలి. రమ తననిగురించి ఏమనుకుంటోందో? రమ — తన రమ — అనుకుంటూండగా తన పాత స్మృతులు ఒక్కసారి కళ్ళముందు మెదలాయి.

* * *

సుధ తను మేనమామ మేనత్త పిల్లలు. చిన్నప్పట్నించీ ఇద్దరూ ఒకేచోట పెరగటంవల్ల వారిద్దరిమధ్యా ఉండే అను బంధ మింతా అంతాకాదు. ఇద్దరికీ యుక్త వయస్సు రావటంలో యౌవనం వారిద్దరిలోనూ పొంచి పొంచి చూస్తోంది. యౌవనంతోపాటు తనకి సుధమీద ఆశలు చెలరేగుతూ వచ్చాయి. ఓరోజు ఇద్దరూ కాలువగట్టున ఏకాంతంగా కూర్చున్నారు. ఆ రోజున ఎందుకో సుధతో రోజూ వున్నంత చనువుగా మాట్లాడలేకపోతున్నాడు. మాటమాటకీ తడపడుతూండటం సుధకి అర్థం కాక —

'ఏమిటి బావా; ఇవాళ అలాఉన్నావేం? ఏదో చెప్పటానికి భయపడుతున్నావు — నాతో చెప్పవూ?' అని బ్రతిమలాడే ధోరణిలో ఎలాగేనా ఆ రహస్యం తెలుసుకోవాలన్న ఉద్దేశ్యంతో అడిగింది.

యస్. యస్. లక్ష్మి

'ఆ...ఆ... ఏమీలేదు... చూడు .. సుధా' అని గుండె ధైర్యం చేసుకొని 'నేనంటే... నీకు... ఇష్టమేకదూ?' అనుమానంగా ప్రశ్నించాడు.

'అదేమిటి. ఇదేదో కొత్త ధోరణి; నిజం చెప్పమంటావా?' అని ఓరగా చూస్తూ '—నువ్వంటే నాకు–' అని ఆపింది నవ్వెన్నుగా.

చెప్పే దేనిటో తన కర్థమయినట్లు దగ్గరగా చేరాడు. సుధ ఓసారి తన ముఖంలోకి చిలిపిగా చూసి– 'నువ్వంటే నాకు—నాకు— అయిష్టం' అని పకపకా నవ్వేశింది.

'నేను అమ్మతోటీ మామయ్యతోటీ చెపుదా మనుకొంటున్నాను' అని వచ్చే ఆవేశంతో అన్నాడు.

కొంచెం ఎడంగా ఉండేందుకు ప్రయత్నిస్తూ 'దేనిగురించి?' అర్థమవనిదానిలా 'ముందర నాతో చెప్పకూడదూ?' అని ప్రశ్నించింది సుధ.


గుండెభారం తీరినవాడిలా ధైర్యంగా 'మరేంలేదులే – మన పెళ్ళిగురించి' అని సమాధానం గురించి వేచియుండకుండా సుధని కౌగలించుకోబోయాడు.

పరిస్థితి అర్థం చేసుకొన్న సుధ, బాహుబంధాలలో చిక్కకుండా తప్పించుకొని 'అదాండీ అబ్బాయిగారూ – ఇందాకటినుంచి నువ్వు పడే తొట్రుపాటూ, కలవరపాటూ; ఏదో చెప్పలేక చెప్పలేక చెప్పటం ఇప్పుడు అర్థమయింది. నీ నడవడికనుచూసి నేను మొదటే అనుమానించాను,' అని కొంతసేపు ఆగింది.

సుధ ప్రవర్తనకు కొంచెం కలతచెందాడు. తొందర పడ్డానేమో అనుకొన్నాడతను. కాని జరిగినదానిని గురించి ఆలోచించి ప్రయోజనం లేదనుకొని ఏమైనా సమాధానం వస్తుందేమో నని తల వంచుకొని కాలి బ్రొటనవేలితో భూమిమీద వ్రాస్తున్నాడు.

'చూడుబావా! నిజం చెప్పుతున్నాను. మనిద్దరం చిన్నప్పట్నుంచీ ఒకేచోట పెరిగాము. మనిద్దరం మన తల్లిదండ్రులకు ఒక్కొక్కళ్ళమే కనుక ఎంతో గారాబంగా పెంచారు. మనం ఏం చేసినా, ఇద్దరం కలిసి ఎలా తిరిగినా ఎవరూ ఇంతవరకూ అడ్డు చెప్పలేదు. నువ్వంటే నాకు ప్రాణం, చాలా ప్రేమా. నువ్వేమాత్రం అలిగినా నేను ఓర్వలేను. కాని మనిద్దరం ఒకచోట పెరిగినవాళ్ళమవటంచేత – నన్నపార్థం చేసుకోకు బావా – నీ మీద సోదరభావంతో కూడిన ప్రేమని వర్షిల్లచేసుకోగలిగానే కాని, మరింకే విధంగానూ ప్రేమించలేక పోయాను. నువ్వు నా మాటలవల్ల బాధపడితే నేను చూడలేను. నీ హృదయంలో ప్రేమించిన సుధని మరచిపో బావా. నన్ను క్షమిస్తావు కదూ' అంటూ రెండుచేతులూ పట్టుకొని కంట తడి పెట్టింది.

తను కట్టుకున్న గాలిమేడ లన్నీ




ఒక్కసారి కూలిపోయాయి. కాని తను బాధ పడుతున్నాడంటే సుధ మరింత బాధపడుతుం దని 'నిజమే సుధా – నేనే పొరబడ్డాను. నువ్వు నా మీద పెంచుకొన్న ప్రేమ – అనుబంధం అలాగే ఉండనీ' యని బొంగురుకంఠంతో అనగలిగాడు.

ఇంటికి వెళ్ళేవరకూ ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. ఇంట్లో ఇద్దరూ మౌనంగా ఉండటం చూసి తన తల్లి 'ఏమర్రా, మళ్ళీ ఏమొచ్చిందీ; ఏమో నమ్మా, ఇద్దరికీ ముడివేస్తే సరిపోతుంది!' అని మామయ్య వచ్చింతర్వాత 'అన్నయ్యా – సుధకి వయస్సు వచ్చింది. ఏదో వాళ్ళిద్దరికీ మూడు ముళ్ళూ పడేస్తే బావుండు'నని ఛలోక్తిగా అంది.

'ఇందులో మనదేముందే, వాళ్ళిష్టం' అని తప్పించుకొన్నాడు మామయ్య.

సుధకి ఇష్టం లేకపోయిన కారణం వల్లనైతేనేమి, తను పట్టు పట్టినందు వల్లనైతేనేమి – సుధకి రామారావుతో వివాహం జరిగింది. రామారావు ఇంజనీరు; అందగాడు. సుధకి తగిన భర్త అనుకున్నాడు మనస్సులో. 'కలకాలం సుఖంగా ఉండమని' తన మనస్సులో సుధని దీవించాడు.

ఇంతకాలం ఇద్దరూ కలసిమెలసి, ఈనాడు విడిచి కాపురానికి వెళ్ళుతూన్నందు కెంతో విచలితయై విచారించింది సుధ. తనుకూడా దుఃఖం ఆపుకోలేక అతలాకుతల మైపోతున్నాడు.

'ఎప్పుడేనా ఉత్తరాలు వ్రాస్తూండు' అని కోరాడు.

*  *  *

సుధదగ్గిర్నించి ఉత్తరం వచ్చినప్పుడల్లా 'సుధకి సుఖంలేదు. అల్లుడొక తరహామనిషి' అని అంటూండేది అత్తయ్య. అపుడపుడు తనకూ్కడా ఉత్తరాలు వ్రాసేది. ప్రతీ ఉత్తరంలోనూ 'బావా నువ్వు తొందరగా పెళ్ళి చేసుకో, నీ కూతురిని ఎత్తుకోవాలని ఉం' దని వ్రాసేది. తనకేమీ సుధమనస్సు ఆ వ్రాతలలో బోధపడేదికాదు. ఓరోజున సుధ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. కవరు చింపి చూసాడు. పెద్దవుత్తరం—ఏదో విశేష ముందని ఆదుర్దాగా చదవసాగాడు.

బావా!

ఈ ఉత్తరం ఎలా రాయాలో తెలియటములేదు. మావారు చాలా మంచివారు.'

'అదేనమ్మా కావలిసినది - కలకాలం ఇలాగే ఉండాలమ్మా' అని మనస్సులో అనుకొని సంతోషంగా చదువసాగాడు.

'నేను పెళ్ళయినతర్వాత ఈ ఆరు నెలల్లో ఆయనదగ్గర ఎన్నో నేర్చుకున్నాను. ఆయనవన్నీ సిద్ధాంతాలు. వాటి ప్రకారం నడుచుకోవా లంటారు. ఎవరి పని వాళ్ళు చేసుకోవా లంటారు. ఇంట్లో అంట్లుతోమటానికిపనిమనిషి వద్దంటారు. అలా అని పీనాసి కాదు సుమీ. మొదట్లో సుకుమారంగా పెరిగిన నాకు కష్టమనిపించేది. తరవాత అలవా టయిపోయింది. నాపని నే చేసుకోటంలో ఎంతో ఆనందం కలుగుతోంది. అత్తమామ లంటావా కడుపూజ్యులు. వారు నా మాటకి ఎపుడూ అడ్డుచెప్పరు. అలాగని వారిమాట కాదని నే నెన్నడూ అనలేదు. మనసంగతి మావారికి చెప్పాను. ఆయన అంతా విని 'పిచ్చిపిల్ల' అన్నారు. ఈర్ష్యపడుతారనుకొన్నాను. కాని నీగురించి ఆయన చాలా బాధపడ్డారు. ప్రతీ ఉత్తరంలో వ్రాసేటప్పుడు, నిన్ను పెళ్ళి చేసుకోమని ఉత్తరం వ్రాయమంటారు. మనిషి నిష్కల్మష బుద్ధితో ఒకే ఒకవ్యక్తిని ప్రేమిస్తాడు. అది సాఫల్యంకానినాడు ఆ మనిషికి జన్మంతా ప్రేమ అంటే పిచ్చిగా తోస్తుంది. జీవితమంటే విరక్తి పుడుతుం దంటారు. ఆయన అలా చెప్పినప్పట్నించీ నా కెదో భయంగా ఉంది. నువ్వు తప్పకుండా పెళ్ళి చేసుకోవాలి. నీకు నీ జీవితం సుఖంగా ఉండాలి.

మనిషికి ఏదేనా బాధ ఉంటే ఆత్మీయులతో చెప్పుకొంటే కొంతబాధ విముక్తి కలిగి గుండె తేలికపడుతుం దంటారు. ఇన్నిసుఖా లున్నా నాకు ఒక తీరనిలోటు సంభవించింది బావా. ఈవిషయం నీ ఒక్కడికే వ్రాస్తున్నాను. మావారికి పిల్లలుంటే సంసారసుఖాలకి అడ్డు వస్తారనొక అపనమ్మకం. అందుచేత ఆయన ముందరే ఆపరేషను చేయిచుకొన్నారట. ఇంక ఈజన్మకి తల్లిని గానేరనని ఒకచే

ఆవేదన నాకు. నువ్వు పెళ్ళి చేసుకుంటే నీకు పుట్టబోయే పిల్లల్లో ఒక ఆడపిల్లని తెచ్చుకొని పెంచుకొందా మని ఆశతో వ్రాస్తూవచ్చాను ఇన్నాళ్ళూ. నువ్వు తప్పకుండా పెళ్ళి చేసుకొంటావు కదూ బావా ?

నామాట కాదనవన్న ఆశతో నీ ఉత్తరంకోసం ఎదురుచూస్తూ ఉంటాను।

ఇట్లు

నీసుధ'

ప్రతీ ఉత్తరంలోనూ పెళ్ళి చేసుకో మని సుధ ఎందుకు వ్రాస్తూందో తన కిప్పుడు అర్ధమయింది. విధివైపరీత్యము. అన్నీ ఉన్నాకాని ఏదోఒక లోటు పెడ తాడు భగవంతుడు. ఆమె కోరినప్రకారం పెళ్ళి చేసుకుంటా నని సమాధానం వ్రాశాడు.

పెళ్ళికూతురి చూపులు, పెళ్ళి నిశ్చయం, పెళ్ళి జరగటం ఒకేవారంలో తలవనితలంపుగా జరిగిపోయినై. ఈ వారంరోజులూ మరో వారంరోజులూ సుధా రామారావులు అక్కడే ఉన్నారు. పెళ్ళికూతురు ఉమ, రామారావుకి దూరపు చుట్టము. పెళ్ళి అయిన వారంరోజులూ సుధా రామారావుల హడావిడి ఇంతా అంతా కాదు.

తన చెల్లెలు ఉమని సరిగ్గా చూడమని తనతో మరీ మరీ చెప్పింది. 'చెల్లమ్మా— బావ ఏమన్నా అంటే తక్షణం నాకు ఉత్తర వ్రాసెయి. నేను వచ్చి బావభరతం పట్టిస్తా.' అని సుధ అంటూంటే తనూ రామారావూ పొట్టలు చెక్కలయ్యేటట్టు నవ్వారు. కొత్తపెళ్ళికూతు రవటంచేత నవ్వు వస్తున్నా సిగ్గుతో తల వంచుకొని తనలో తనే నవ్వుకొంది ఉమ.

'ఆ—అన్నట్లు చెప్పటం మరచిపో యాను. మీ అన్నగారూ నేనూ రేపే ప్రయాణం। అని ఉమకేసి చూసి 'చెల్లీ— బావ నాకో మాట ఇచ్చాడు. అదేమిటో తెలుసా ?' అని సుధ అడుగుతూండగా ప్రశ్నార్ధకంగా చూసింది ఉమ.

'చెప్పమంటావా బావా ?' అని తన కేసి చూసి—నీ యనుమతి నా కెందుకులే అన్నట్లు 'మీకు పుట్టబోయే పిల్లని నా కిస్తా నన్నాడు బావ,' అని తనకేసి తిరిగి 'బావా—చెల్లి నన్నే పోలింది సుమీ. నువ్వేమన్నా చెల్లిని అంటే వప్పుకోను. అమెని పువ్వుల్లో పెట్టి కనుపాపలా చూసుకోవాలి' అని మళ్ళ బోధించింది సుధ రామారావు చిరుకోపం నటిస్తూ సుధకేసి చూశాడు.

ఆ మరునాడే సుధా, రామారావులు వాళ్ళ వూరికి వెళ్ళిపోయారు.

రెక్కలు అమ్ముకొన్ననాడు హిమా లయా పర్వతాలలోకి వెళ్ళమన్నా తప్పదు. పెళ్ళయిన రెండు నెలలకే ఉత్తర హిందూస్థానానికి బదిలీ అయింది తనకు. వెడుతూ వెడుతూ సుధా రామా రావులతో వారంరోజులు గడిపి తనూ ఉమా వెళ్ళారు. తాము దూరదేశం

వెడుతూంటే సుధ కంట తడి బెట్టింది. ప్రతీ వారం ఇద్దరినీ ఉత్తరం రాయమని కోరింది. తర్వాత ఉమకి, జరిగిన సంగతంతా విపులంగా చెప్పాడు తను. ఉమ మౌనంగా చెప్పినదంతా విని ఊరుకుంది.

ప్రతీ ఉత్తరంలోనూ సుధా రామారావులను తమ వూరికి వచ్చి కొంత కాలం ఉండమని వ్రాసేవారు. వీలు చూసుకొని వస్తామని వారు సమాధానం వ్రాసేవారు. అత్తా మామలని రమ్మనమని వ్రాసేది ఉమ. అలవాటయిన వూరు విడచి రానేరమంటారు.

తామా వూరు వచ్చి పదినెలలయింది. ఓ రోజున సుధా రామారావుల వద్దనుంచి ఉత్తరం వచ్చింది. రామారావు నెల్లాళ్ళు శెలవు పెట్టాననీ, పదిహేనురోజుల్లో వస్తున్నామనీ వ్రాశారు. ఇంక తమకి కలగిన సంతోషానికి మేరలేదు. ఇంకో వారంరోజుల్లో వస్తున్నా రనగా హటాత్తుగా సుధ టెలిగ్రాం ఇచ్చింది—రామారావు కారు ప్రమాదంలో చిక్కుకున్నాడనీ, తక్షణం బయలుదేరి రమ్మనమనీ. రాక రాక ఇంతకాలానికి రాబోతున్నారంటే ఏమిటీ దారుణం. తత్‌క్షణమే ఇద్దరూ బిక్కు బిక్కుమనే ప్రాణాలతో బయలుదేరారు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఎక్కడ చూచినా నిశ్శబ్దం ఆవరించుకొని విచారాన్ని వెలిబుచ్చుతూంది. ఇంట్లో ఎవరూ కనిపించరేం? వసారాలోకి గబగబా వెళ్ళారు. మేనమామ ఒంటరిగా కూర్చున్నాడు, అదోలా ముఖంపెట్టి.

'మామయ్యా—రామారావు కెలాఉంది? కులాసాగా ఉన్నారా? ఏమిటీ! ఎవరూ కనిపించరేం? సుధ ఏది? రామారావు ఎక్కడ?' అని ప్రశ్నలవర్షం కురిపించాడు. ఉమ ఆయనకేసి తేరపారి చూస్తోంది.

ఆయన ఏమీ సమాధానం చెప్పకుండా, వస్తూన్న కన్నీటిని ఆపుకుంటూ పడక గదికేసి చూశాడు. గబగబా పడకగది వేపు పరిగెత్తాడు తను. గదిలోనుంచి బయటకు రాబోతున్న మనిషి—ఎవరూ? తేరిపార చూశాడు — సుధ — ఏవిఁటి, తెల్లబట్టలు కట్టుకొని—జుత్తు విరబోసుకొని — తనను చూసి లోపలికి పరిగెత్తి, ముఖం గోడవేపు త్రిప్పుకొని, పమిట చెంగు ముఖంమీద కప్పుకొని, వచ్చే దుఃఖాన్ని ఆపుకొందుకు ప్రయత్నిస్తోంది. తనేదీ చూడలేకపోతున్నాడు; నమ్మలేకపోతున్నాడు. 'సుధా! రామారావు' అనబోతూండగా ఒక్కసారి సుధ తనవేపు తిరిగింది. తన కళ్ళని తనే నమ్మలేకపోతున్నాడు. కళ్లు చీకట్లు కమ్మి భూమి గిరగిరా తిరుగుతున్నట్లుంది. వెక్కి వెక్కి ఏడుస్తూ ప్రక్కనే ఉన్న ఉమని గమనించలేదు. సుధ అక్కడ ఉండలేక గబగబా వెళ్ళి మంచంమీద దిండులో తలదూర్చి గట్టిగా ఏడుస్తూంది.

తనేం చేయాలి? ఇంత అవాంతరం




వస్తుందని కలలోకూడా అనుకోలేదు. ఈ వార్త కోసమేనా తను వచ్చింది. తన జీవితంలో వెలుగును చూపించిన రామారావు, పాతికేళ్ళైనా సరిగా నిండని సుధ జీవితంలో వెలుగుని — ఆలోచించలేక పోతున్నాడు. 'అన్నయ్యా' అని గట్టిగా అరచి కుర్చీమీద కుప్పలా కూలి పోయాడు. సుధ తల్లిదండ్రులు, అత్త మామలు, బావమరుదులు, తన తల్లి దండ్రి, ఉమ – అందరూ కేకవిని ఒక్కసారి వచ్చి తనచుట్టూ చేరారు. తనకింకేం తెలియటం లేదు.

* * *

అంత్యక్రియలు అయినతర్వాత సుధ, తను, ఉమ, వృద్ధులు అంతా కలిసి తనవూరు చేరుకొన్నారు. సుధకి నిద్రాహారాలు లేవు. తను వెళ్ళి నచ్చచెపితే కాని భోజనం చేసేది కాదు. ఇంక మరునాడు ప్రయాణం అనగా తనూ ఉమా సుధని కలుసుకొని—

'పోయినవార్ని గురించి విచారిస్తే తిరిగిరారు. పుణ్యపురుషులకు, మంచి

వారికి, మంచి తేజస్సు కలవారికి, విజ్ఞానవంతులకి ఆయువు తక్కువంటారు. అటువంటివారిలో రామారావొకడు. ఆయన ఆత్మశాంతి పొందాలంటే ఆయన ఆదేశాలను, సిద్ధాంతాలను పాటించాలి సుధా. అంతేకాని దుఃఖిస్తూ కూర్చుంటే ఆయన ఆత్మ శాంతి పొంద' దని బోధించాడు తను.

'నిజమేబావా. మీ కభ్యంతరంలేకపోతే నేను మీతోటి వస్తాను. నేను చదువుకోని దాన్ని కాదుకదా. నేను నా రెక్కలమీద బ్రతుకుతాను, అప్పుడే ఆయన ఆత్మకు శాంతి' అని తన నిశ్చయాన్ని వెలిబుచ్చింది.

సుధ సంతోషంగా ఉంటే చాలని తనూ ఉమా కాదనలేదు. తల్లిదండ్రులు వద్దని వాదిస్తున్నా సుధ తమతో వచ్చింది. ఇంటి పనులన్నీ తనే చేస్తాననేది. ఉద్యోగాలకి ధరఖాస్తులు పెట్టేది. 'నీ కేం తక్కువ సుధా. మాకుమాత్రం ఏ పదిమంది దొర్లిపోతున్నారనీ, నువ్వు ఉద్యోగం చేస్తే కాని గడవదనటానికీ,' అంటే వినేది కాదు. ఓరోజున ముగ్గురూకలిసి 'ఏకోహీ రాస్తా' సినిమా చూసివచ్చారు. ఆ సినీమా చూసినప్పట్నుంచీ తన కెందుకో మనస్సు బాగుగాలేదు. 'సుధ ఎందుకు సుఖపడ కూడదు, పాతికేళ్ళైనా సరిగా నిండని వైధవ్యం: సుధ మళ్ళీ ఎందుకు పెళ్ళి చేసుకోకూడదు?' అన్న సమస్య తనని వేధిస్తోంది. ఉమతో సంప్రదించాడు. సుధ ఏపరిస్థితుల్లోనూ వప్పుకోదు. ఆయినా అడిగిచూడం' దని సలహా ఇచ్చింది. ఓరోజున ముగ్గురూ కలిసి భోజనం చేస్తున్నారు.

'సుధా, మొన్న మనం చూసిన సినీమా గురించి నీ అభిప్రాయ మేమిటి?' ఏం సమాధానం వస్తుందోనని భయపడుతూనే అడిగాడు.

'నాకు నచ్చలేదు' అని ముభావంగా సమాధానమిచ్చింది.

ధోరణి పొడిగించే ఉద్దేశ్యంతో 'చూడు సుధా! మనిషన్నతర్వాత బాహ్యాప్రపంచానికి భయపడి, కొన్ని కట్టుబాట్లకి కట్టుపడిఉంటాడు. అలాగని తన ఐహికబాధలని ఓర్చుకుంటాడు కాని...' అని మాట్లాడుతూండగానే మాటల్లో అడ్డుపడి —

'బావా' బాధలన్నీ జీర్ణించుకుపోయిన ఉచ్చారణతో 'నిన్ను నేను చిన్నప్పట్నించీ ఎరుగుదును, నీ నడవడిలో ఏమాత్రం బేధం వచ్చినా నేను తెలుసుకోగలను. ఆ సినీమా చూసింతర్వాతనుంచీ నీలో మార్పు వచ్చింది. నా గురించే అలోచిస్తున్నావని కూడా నాకు తెలుసు. నువ్వు నా కెదో చెపుదామనుకుంటున్నావు కదూ — నువ్వు చెప్పే దేదో నాకు తెలుసును. నేను చెప్పేది విను. ఆ సినీమాలో చూపించిన స్త్రీ రెండవవివాహం చేసుకోటం అన్నది తప్పు అని నేనటం లేదు; అది ఒప్పు అనీ అనటంలేదు. ప్రతి

స్త్రీ ఒకేఒక పురునికి మన స్సిస్తుంది, ఆ పురుషుడే తనకి సర్వస్వం – దైవం. కొంతమంది అలా కాదంటారు. నా సర్వ స్వం రామారావుగారే. నన్ను నీ అర్ధాం గిగా చేసుకోవాలన్న నీకు, మనస్సు ఇవ్వ లేకపోయానుకాని నువ్వంటే నాకు అమిత మైన ఇష్టం. నువ్వు బాధపడుతూంటే నేను చూడలేను. నువ్వుకూడా నా పట్ల అలా ఉన్నావని నాకు తెలుసు. ఏ పరిస్థితుల లోనూ నా నిశ్చయం మారదని నాకు దృఢవిశ్వాశం ఉంది. నే నెందుకు బ్రతికున్నానంటే చావుకి భయపడి కాదు; ఐహిక సుఖాలకి లొంగిపోవాలని కాదు. ఆయన ఆత్మశాంతికోసం పాటుపడటం కోసం – మరి రెండోది – నువ్వు నా కిచ్చినమాట గుర్తుందికదూ. నా కెలాగూ పిల్లల్లేరు. కనీసం నీకు పుట్టబోయే పిల్లని పెంచుకొని 'అమ్మా' అని పిలిపించుకొని నా తనువుని బ్రహ్మానం దంగా విడుస్తాను. ఇంక నాకేమీ చెప్పకు బావా. ఒకవేళ నేను నా నిర్ణయానికి కట్టుబడలేకపోతే, అన్నం తింటూ ప్రమాణం చేస్తున్నాను. నీ అనుమతి లేనిదే ఏమీచేయను,' అని చెప్పేటప్పటికి మే మిద్దరమూ కొయ్యబారిపోయినట్లు కూర్చుండిపోయాము.

ఇంక ఆ ప్రశ్న కి ఎవరూ తీసుకు రాలేదు. అత్తయ్యా మావయ్యా ప్రతీ ఉత్తరంలోనూ సుధని రమ్మనమని వ్రాసేవారు. ఉమకి నెల తప్పింది. అప్పట్నించీ ఉమని కాలు కదుపనీయదు. ప్రతీపనీ తనే చేస్తా ననేది. పుట్టబోయే పిల్ల తనదేనని నిశ్చయించింది. స్వెట్టర్లు, సాక్సు అల్లటం ప్రారంభించింది. సుధ ఎప్పుడూ అంత ఆనందంగా ఉండటం చూడలేదు. ఉమకి ఆడపిల్ల పుడుతుందని సుధ–కాదు మగపిల్లవా డనితను. ఇద్దరూ ఉమని అడిగారు. చమత్కారంగా 'ఎవరికి నామీద ఎక్కువ ఆప్యాయతో వారి కోరిక నెరవేరుతుం'దని తీర్పు చెప్పింది. ఎంతకేనా ఆడవాళ్ళు ఆడవాళ్ళనే వెన కేసుకొస్తారు. 'నా అనుమానం – ఆడ పిల్లే పుడుతుం' దని, మళ్ళీ అని 'మీరు ఓడిపోతారు సుమా' అని తనవేపు చిలిపి కళ్ళతో చూసింది. తను మూతి బుంగలా పెట్టేశాడు. ఏడవనెలలో ఉమనీ సుధనీ వూరికి పంపించేశాడు. ఇంక తన కిం కేమీ తోచేది కాదు. ఎలాగో కొంత కాలం ఓపికపట్టి శలవు తీసుకొని తనూ బయలుదేరాడు. పైకి ఎలా ఉన్నా తన మనస్సులో మాత్రం సుధ కోరికే నెర వేరాలని దేవుణ్ణి ప్రార్థించాడు. అలాగే జరిగింది.

'బావోయి, నా పంతం నెగ్గింది; ఆడ పిల్లే పుట్టింది. చూడు బావా ఎంత బావుందో. అంతా తల్లిపోలికే. రమ ఎలా ఉంది బావా అని పిల్లని పేరుపెట్టి పిలుస్తూ పొందిన సంతోషానికి హద్దులు లేవు.

ఆడపిల్ల పుట్టినందుకు పెద్దఎత్తున

అందరినీ పిలిచి విందు చేయాలని సుధ నిర్ణయించింది. ఏ పని లెలా చేయాలో నెమరువేసుకొంటూంది పిల్ల పుట్టి మూడు రోజులైంది. ఉమకి కొంచెం జ్వరం తగిలింది. సుధ, ఉమవద్దనే కూర్చుని సపర్యలు చేస్తోంది. నాటువైద్యం చేయించారు. కాని సాయంత్రానికి జ్వరం ఎక్కువయింది. లేడీ డాక్టరుని తీసుకువచ్చి చూపించారు. ఉమకి ఇంజక్షను ఇచ్చి వేయే మందు లెలా ఇవ్వాలో చెప్పి 'తెల్లవారేటప్పటికి తగ్గకపోతే తక్షణం కబురుచేయం' డనిచెప్పి వెళ్ళిపోయింది. సుధకి కంగా రెక్కువయింది. అస్తమానూ ఉమదగ్గరే ఉండి కంటిపాపలా చూసుకొంటోంది.

జ్వరం తగ్గే సూచన లేమీ కనుపించ లేదు. తనకికూడా నిద్ర పట్టటం లేదు. రాత్రి పన్నెండయింది. ఉమ బాధతో మూలుగుతోంది.

'ఏమమ్మా, ఎలా ఉంది' అని ఆప్యాయంగా నుదురుమీద చేయివేసి అడిగింది

'ఊః బాధగా ఉంది అక్కా' అని 'నా కేదో అనుమానంగా ఉంది. నేనింక బ్రతకను' అని నిరాశగా అంది.

'తప్పమ్మా, అలా అనకూడదు. నీకు నయం అవుతుం' దని ధైర్యం చెప్పబోయింది.

'ఏమో!' అని – 'ఈ గదిలో ఇంకెవరూ లేరుకదూ?'

'లేరమ్మా' అని కళ్ళల్లోకి చూస్తూ సమాధానం చెప్పి ఆలోచిస్తోంది సుధ.

'ఆలోచిస్తున్నా వేమి టక్కా' అని జీరపోయిన గొంతుకలోంచి వెలువడిన మాటలు విని, ఉలిక్కిపడి 'ఏం లేదమ్మా' అని అనగలిగింది.

'ఒకసారి బావని పిలుస్తావా' అనగానే 'సరేనమ్మా' అని లేచింది.

'భగవంతుడా నేను ఈ లోకంలో ఉండి ఎవరికీ ప్రయోజనం లేదు. నన్ను తీసుకుపోయి ఉమని కాపాడు తండ్రీ' అంటూ మనస్సులో దేముణ్ణి ప్రార్థిస్తూ తనదగ్గరికి వచ్చి –

'బావా ఓసారి లేస్తావా?' అని మెల్లిగా లేపింది.

తను ఖంగారుగా లేచి 'ఎలా ఉం'దని అడిగాడు


'జ్వరం తీవ్రంగా ఉంది. నిన్ను రమ్మంటోంది బావా' అని పొర్లివచ్చే దుఃఖం ఆపుకోలేకపోయింది.

'ఏమిటి నువ్వనేది – ఉమకి' ...అని పూర్తి – చేస్తూండగా

'గట్టిగా అనకు బావా, పాపం ఆ తల్లిదండ్రుల కెంత బాధగా ఉంటుందో' అనగానే మెల్లిగా ఉమ దగ్గరకి వెళ్ళారిద్దరూ.

'దగ్గిరగా రండి. ఇలా కూర్చోండి. అక్కా నువ్వుకూడా కూర్చో' అని సన్నగా అంది.

'ఏమండీ – నాకు పిలుపు వస్తోంది.




నే నింక చాలాసేపు ఉండను' అని అంటుండగా 'ఉమా_నా కన్యాయం చేయకు. నీకు కులాసాగా ఉంటుంది' అని కళ్ళంబట వచ్చే నీటిని తుడుచుకున్నాడు.

ఉమ సుధవేపు తిరిగి 'అక్కా_ ఈ పిల్ల నీ పిల్లే. తల్లివైనా తండ్రివైనా నీవే. నా కో మాట ఇస్తావా? ఇంక నే చెప్పలేకపోతున్నా' అని బాధగా మూలిగింది. ఉమ చేతిలో చేయి వేసింది సుధ. ఉమ మళ్ళీ మొదలుపెట్టింది.

'నీ గుణం ... నాకు తెలుసు. తెలుసుండికూడా ... మళ్ళీ కోరుతున్నాను. ఒకవేళ...నువ్వు... పెళ్ళి...చేసుకో.. నిశ్చయించుకుంటే...మీ బావని...చేసుకొంటావు కదూ ... ఇదే నా ఆఖరి... కోరిక ... ఇచ్చిన మాట ... తప్పవు కదూ...' అంటూ జాలిగా సుధ ముఖంలోకి చూసింది ఉమ.

'బావ అనుమతి లేనిదే ఏమీ చేయనని ఆనాడు మాట ఇచ్చాను. గనుక ఒకవేళ నువ్వన్నట్లు నేనేగనుక ఓ నిర్ణయానికి వస్తే బావనే పెళ్ళి చేసుకుంటాను. నీ ఆత్మశాంతికోసం_నువ్వేం చేయమన్నా చేస్తాను. తప్పకుండా నీ పిల్లని నా కంటిపాపలా చూసుకుంటాను,' అని వాగ్దానం చేసింది సుధ.

'ఏమండీ _ మీరు _ మళ్ళీ _ పెళ్ళి_ చేసుకొంటే... సుధనే _ చేసుకొండి_ సుధ ... చాలా ... మంచిది ... నాకు మాట ... ఇస్తారు ... కదూ!' అనలేక అంది ఉమ.

ఉమ చేతిలో చేయి వేసి_కన్నీటితో ఉమకేసి చూస్తున్నాడు. ఉమ రెండు

చేతుల్లోనూ ఇద్దరిచేతులూ ఉన్నాయి. జ్వరం చాలా ఎక్కువగా ఉంది.

ఎక్కువగా మాట్లాడించకూడదని ఎవరూ మాట్లాడలేదు. ఉమ మంచం మీద పడుకుని ఉండగా తను సుధ ఇరు ప్రక్కలా కూర్చున్నారు. ఒక గంటసే పయిన తర్వాత ఏమన్నా కావాలేమో నని ఉమని పలకరించింది సుధ. ఎంత పలకరించినా పలుకలేదు. మాట స్థభించి పోయింది.

'ఉమా— ఉమా' అంటూ గట్టిగా ఇద్దరూ పిలిచారు. ఇంకా శ్వాస ఉంది.

హడావుడికి అందరూ లేచారు; గబ గబా వెళ్ళి డాక్టరుని పిలుచుకవచ్చారు. కాని శాశ్వతంగా ఉమ మాట్లాడటం మానివేసింది.

గుండెలు బాదుకుంటూ అందరూ గొల్లుమని ఏడ్వటం ప్రారంభించారు. అంత్యక్రియలన్నీ అయిన తర్వాత కొన్నాళ్ళుండి పిల్లని సుధకి అప్పచెప్పి-

"సుధా! నీ రమకి తల్లివైనా తండ్రి వైనా — నువ్వే. నా బాధ్యతలన్నీ నీమీద వదిలేసి వెడుతున్నాను. మన ముగ్గురి తల్లిదండ్రులూ కడు వృద్ధులు. మన అందరికీ తల్లిదండ్రు లుండగా ఈ పసి పాపకే కరువు రావాలా. ఏ లోటూ రాకుండా నీ పిల్లని చూసుకో. నేను అప్పుడప్పుడూ వచ్చి చూస్తూంటా' నని ఎన్నెన్నో ఆశలతో, ఆ వూరు వచ్చిన తను, తన ఆశలన్నీ నిరాశలై పోగా సర్వస్వం అనుకొన్న ఉమను పోగొట్టు కొని, కనీసం ఆ నోరులేని పసిపాప కోసం ఇంకా బ్రతకాలన్న ఆశతో తిరుగుముఖం పట్టాడు. భర్తనుపోగొట్టు కొన్న సుధా, భార్యను పోగొట్టుకొన్న తనూ ఆ పసిపాప భవిష్యత్తుకోసం జీవ చ్ఛవాల్లా ఇంతకాలంనుంచీ కాలంగడుపు కుంటూ వస్తున్నారు, ప్రతీ ఏడాదీ తను ఒకసారేనా వెళ్ళి పిల్లని చూసిరావటం- అందులో ఏదో అనుభూతి పొందటం జరుగుతూంది. 'ఇప్పుడు రమకి ఏడేళ్లు. వెళ్ళినప్పుడల్లా తనదగ్గరే ఉంటుంది,' అనుకొంటూ పాతస్మృతుల్లోంచి తేరు కొని టైము చూసుకొనేటప్పటికి అపుడే తొమ్మిదయింది.

* * *

మరునాడు కావలసినవన్నీ కొనుక్కొని తనఊరు బయలుదేరాడు.

'నాన్నారు వచ్చారు. అమ్మా— నాన్నారు వచ్చారు' అని రమ సుధని పిలుస్తూ తనకాళ్ళని చుట్టివేసింది. రమని ఎత్తుకొని ముద్దాడి లోపలికి వెళ్ళాడు.

'నాయనా వచ్చావా, ఎప్పటికప్పుడే వస్తావనుకుంటున్నాము' అని తల్లి ఆహ్వా నించింది. తండ్రీ, మేనమామ, అత్తయ్య అందరినీ పలకరిస్తూండగా 'బావా కులా సాగా ఉన్నావా?' అంటూ సుధ వచ్చింది.

మధ్యాహ్నం భోజనా లయింతర్వాత రమ వచ్చి తను చదువుకున్న చదువంతా వల్లించింది. స్కూల్లో ఎలా చదువు



తూందో, అమ్మ తన కేమేమి చేస్తూందో అన్నీ పాఠం పప్పచెప్పినట్లు చెప్పింది. అన్నీ విని సంతోషించి 'సుధ నీకు అమ్మే కాదమ్మా, మనపాలిటి దేవత. ఆరోజు సుధ మన ల్నాదుకోకపోతే మన పరిస్థి తెలావుండేదో' అని మనస్సులో అను కున్నాడు.

'నాన్నారూ! మీరు వచ్చినప్పుడల్లా నన్ను మీతో తీసుకువెడుతా నంటారు కాని న న్నె ప్పు డూ తీసుకెళ్ళరు. అమ్మని అడిగితే 'అలాగేలే' అంటుంది నాన్నారూ. మరి ఈమాటు నన్నూ అమ్మనీ తప్పకుండా తీసుకువెడలారు కదూ? అని చిక్కుప్రశ్న వేసింది ఏమెరు గని రమ.

తనకి పెద్దచిక్కే వచ్చింది. సమయాను సారంగా 'అలాగే' అని తప్పించుకో బోయాడు. 'మరి మీరు అలాగే అంటారు. తీసుకువెడతాను అనండి' అంటూ మారాం చేసింది. 'తీసుకువెడతా నమ్మా' అని, 'మా బాధలు నీ పసిహృదయాని కేం అర్థమవుతుం'దని మనస్సులో అనుకున్నాడు.

చూస్తూండగా రోజులు దొర్లిపోతు న్నాయి. దీపావళి ఇంకా వారంరోజులే ఉంది. దీపావళి అయిన వారంరోజుల్లో

తన ప్రయాణం. రమ తనతోటి తీసుకు వెళ్ళమని అస్తమానూ అడుగుతూంది. ఆ రోజున, సుధా తనూ వీధివావడిలో కూర్చున్నారు. రమ స్కూలుకి వెళ్ళింది. ముసలివా ళ్ళంతా పెరట్లో కూర్చుని బాతా ఖానీ వేస్తున్నారు. తనే మాట్లాడటం ప్రారంభించాడు.

'సుధా' అని పలకరించాడు.

అల్లిక అల్లుకుంటూన్న సుధ తల పైకెత్తి 'ఏమిటి బావా?' అని ప్రశ్నించింది.

'తెల్లచీర – నుదుట కుంకుమలేని కోల ముఖం–నిండుయౌవనం మారని అందం– తన అందాన్ని దాచుకుంటూ ఎవరికోసం ఈ జీవితాన్ని గడుపుతోందా!' అని మనసులో అనుకున్నాడు.

'మీ ఇద్దర్నీ నాతో తీసుకవెళ్ళమని రోజూ నాతో అంటోంది రమ!' అన్నాడు.

'నన్నుకూడా రోజూ అడుగుతూంది. నాన్నతోటి ఈసారి ఏమయినా వెళ్ళాలని పట్టుబడుతూం' దంటూ తనకి వచ్చిన సమస్యని బైటపెట్టింది.

తను ఆలోచించి 'పోనీ మీ ఇద్దరూ నాతో వచ్చేయకూడదూ!' అనుమానాస్పదంగా అడిగాడు.

'ఏదో ఇన్నాళ్ళూ గడిచింది. ఇటుపైన గడవటం కష్టమా!' అని 'ఆ– అన్నట్లు–పిల్లని విడిచి నేను, నన్ను విడిచి పిల్లా ఉండలేము ..ఎలాగో?...ఏమిటో?'

మరునాడు – తనే మొదలుపెట్టాడు –

'ఎవరో ఏదో అనుకుంటా రని మన పిల్ల భవిష్యత్తు పాడుచేసుకొంటామా సుధా? నీభర్త పోయినప్పటికి నీకు పట్టుమని పాతికేళ్ళన్నా నిండలేదు. అప్పుడే ఎనిమిదిసంవత్సరాలై పోతోంది. నువ్వు భర్తని పోగొట్టుకొన్న వితంతువు, నేను భార్యని పోగొట్టుకొన్నవాడిని. ఇద్దరం ఇంచుమించూ ఏడేళ్ళనుంచీ ఒకేజీవితం గడుపుతున్నాము. ఇటుపైన గడుపలేమనికాదు. పిల్ల భవిష్యత్తుకోసం మనం త్యాగం చేయవలసివస్తుంది. ఆలోచించుకో సుధా.'

'పిల్లకోసం ఏదేనా చేయకతప్పదనా? పసిపాపను పెంచి పెద్దదాన్ని చేసి, అభివృద్ధిలోకి తీసుకొచ్చి, మన మిచ్చిన మాట నిలబెట్టుకొని, మనవాళ్ళ ఆత్మలకి శాంతి చేకూర్చటం ముఖ్యం' అని ఆగి 'తన ఆత్మకు యదార్ధమని తోచినపనిని ధర్మంగా పాటించిచేసిన మనిషి లోకం కోసం భయపడ నవసరం లేదు. మన మనస్సులు నిష్కల్మషంగా ఉన్నంత కాలం ఎవరో ఏదో అనుకుంటారని లోకానికి వెరవ నవసరంలేదు. అలా చేసి నప్పుడు లోకం కళ్ళల్లో తప్పుగా తోచవచ్చును. కొంతమంది నిందిస్తారు కూడా. కాని ఆ నిందించేవారు మనలను పెట్టిపోషిస్తారా? ఎన్నటికీ జరగనిపని. అందుచేత నేను నిశ్చయించుకొన్న దేమిటంటే – నేనూ రమా నీతోటి వస్తాము. మనిద్దరం నిష్కల్మషంగా జీవితాలని సాగిద్దాం. మనోనిబ్బరం ఉన్నంతకాలం

ఏ ఒక్కరికీ ప్రమాదం లేదు. పిల్ల భవిష్యత్తే మనకి ముఖ్యం' అని తన నిశ్చయాన్ని వెలిబుచ్చింది.

తను ఆశ్చర్యపోయాడు. సుధ ఈవిధంగా నిర్ణయిస్తుందని త నూహించ లేదు. తను పెంచినపిల్లకోసం లోకం ఏమనుకుంటుందో నన్న భయం లేకుండా తనతో రావటానికి వప్పుకుంటోంది.

ఇద్దరి ఆశయాలూ ఒకటే అవటం వల్ల తనకికూడా సుధనిర్ణయం ఆమోద కర మనిపించింది.

* * *

ఆరోజు దీపావళి, రోజంతా కులాసాగా గడిపారు, సాయంత్రం రమచేత దివిటీలు పట్టించి, తీపి తినిపించి సుధ లోపలికి వెళ్ళిపోయింది. తను రమచేత మతాబాలు కాల్పిస్తున్నాడు. ఇల్లంతా దీపాలతో కలకల్లాడుతోంది. రమకి మతాబా వెలిగించి ఇచ్చి తల్లి పిలవగా లోపలికి వెళ్ళాడు మేసమామ మిఠాయి తింటున్నాడు. తండ్రి నట్టింట్లో అమ్మ వడ్డిస్తూంటే భోజనంచేస్తున్నాడు. సుధ వంటింట్లో ఏదో పని చేస్తోంది. అత్తయ్య వచ్చి 'అందరూ తిన్నారు, నువ్వే తినలేదు,' అని మిఠాయి పెట్టింది. మిఠాయి తిని మంచినీళ్ళు త్రాగి సైను చూసుకొన్నాడు. ఏడున్నర అయింది. రమ ఏంచేస్తోందోనని వీధిలోకి వచ్చాడు. వీధిగుమ్మం దాటుతూనే 'అమ్మా!' అని గట్టిగా అరచి రమదగ్గరకి పరిగెత్తాడు.

రమ పరికిణీ అంటుకు మంటలు పైకెగబ్రాకుతూండగా ఏంచెయ్యాలో తోచక అటూ ఇటూ పరిగెడుతోంది. ఎవరి సరదాల్లో వాళ్ళుండి, వీధుల్లోవా శ్ళెవరూ ఇటువైపే చూడలేదు. తనకి ఏంచేయాలో తోచక గంతులువేస్తున్నాడు. తను వేసిన కేకకి ఇంట్లోవాళ్ళు బైటకి వచ్చారు. 'అయ్యో! అయ్యో — సుధా తొందరగా రావే. పిల్లకి బట్ట లంటుకొన్నాయి' అని తనతల్లి అరచింది. సుధ గబ గబా పరిగెత్తుకుంటూవచ్చి 'అయ్యో నాపిల్ల — అందరూ చుట్టూ చేరి అలా చూస్తా రేమిటి' అని అంటూండగా — ఇంతలో హడావుడి చూసి వీధిలో పోగయినవారి లోంచి ఒకమనిషి గబగబా పరిగెత్తు కొనివచ్చి రమని లాక్కెళ్ళి వీధిలోనున్న ఇసుకలో పొర్లించాడు. గబ గబా రమ బట్టలన్నీ విప్పేశాడు. ఆ వ్యక్తికి తమ కృతజ్ఞతలు తెలుపుకన్నా రంతా. ఇదంతా జరగటానికి ఐదునిముషాలు పట్టలేదు, తను ఇంట్లోంచి వచ్చింతర్వాత తక్షణం రమని ఆసుపత్రిలో చేర్పించారు.

ఆసుపత్రిలో రమని ఆపరేషన్ థియేటరులోకి తీసుకవెళ్ళారు. ఎవరినీ అక్కడ ఉండవద్దని చెప్పారు. బాబ పంతంమీద పిల్లని చూడటానికని, తనని ఉండనిస్తా మన్నారు. సుధని మాత్రం అక్కడే పిల్లతో ఉండనిస్తా మన్నారు. ముసలివాళ్ళను ఇంటికి పంపేసి, పిల్లని చూసి వెడతానని చెప్పి సుధ ప్రక్కనే

కూర్చున్నాడు. త నేం చేస్తున్నాడో తెలియటం లేదు. ఆపరేషను థియేటరు లోంచి బయటికి వచ్చిన డాక్టరు వెంట తనూ సుధా వెళ్ళారు.

'పిల్ల కెలా వుంది డాక్టర్' అని తొట్రుపడుతూన్న కంఠంతో అడిగాడు

'కాళ్లూ, ఛాతీ బాగా కాలిందండి పిల్లకి తెలివిలేదు. మా శాయశక్తులా ప్రయత్నిస్తాం. తరువాత మీ అదృష్టం' అని అనుమానంగా పలికిందా కంఠం.

సుధ వెనకాల నుంచుని ఏడుస్తోంది. తను మాత్రం 'ఏమయినా సరే-ఎంత ఖర్చయినా సరే-మా పిల్లని మామూలు పిల్లగా చేయండి' అని ప్రాధేయపడ్డాడు.

ఇంకో గంటసేపయిన తర్వాత పిల్లని ట్రాలీమీద పడుకోబెట్టి బయటకు తీసుకవచ్చారు. కళ్లూ, ముఖం అంతా కట్లుకట్టారు. నోట్లో జేబురుమాలు పెట్టుకొని తనలో తనే ఏడుస్తున్నాడు. వచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక ఒక్కసారి బైటకి వెళ్ళగక్కేసింది సుధ. పిల్లని తీసుకు వెళ్ళి మంచంమీద పడుకోబెట్టారు. ఇద్దరూ మంచానికిరువైపులా నుంచున్నారు.

నర్సు తన దగ్గరకి వచ్చి-కృష్ణమూర్తిగారూ! ఆవిడ ఇక్కడే ఉండవచ్చు. మీరు మాత్రం వెళ్ళి పొద్దున్నే రావచ్చు. పిల్లకి సులువుగా ఉంటుందని ధైర్యం చెపుతోంది. తనుకూడ ఏడుస్తూండటం చూసి 'మీరే అధైర్యపడితే ఎలాగ చెప్పండి. పాపం ఆవిడ కింక ఎలా ఉంటుంది.'

అక్కడినుంచి కదలలేక అడుగులో అడుగు వేసుకుంటూ ఇంటికి వచ్చాడు. వచ్చే ముందు 'పొద్దున్నే వస్తాను, జాగ్రత్త' అని సుధతో చెప్పాడు కాని ఆమె కేమీ వినిపించలేదు.

ఇంటికి రాగానే 'పిల్ల కెలా ఉం' దని అందరూ అడిగారు. జరిగిన సంగతి చెప్పాడు.

రాత్రి తనకి నిద్రపట్టలేదు. పండుగ అంటే అందరికీ ఆనందం. దీపావళి పండుగ అంటే నిప్పుతో చెలగాటా లాడుతారు. అందరికీ ఆనందం చేకూర్చే దీపావళి తన విషయంలో మాత్రం ఇక్కట్టు తెచ్చిపెట్టింది. పిల్ల ఏం బాధ పడుతోందో, పసి ప్రాణం. పుట్టుకతోనే తల్లిని పోగొట్టుకుంది. తల్లికంటే ఎక్కువగా పెంచింది సుధ.' ఇలా ఆలోచించుకుంటూనే రాత్రంతా గడిపాడు. తెల్లవారగానే ఆస్పత్రికి పరిగెత్తాడు.

ఆకాశమంతా మబ్బుగా ఉంది. దూరంగా ఎక్కడో నక్కలు కూస్తున్నాయి. 'ఎలా ఉందో భగవంతుడా' అంటూ ఆస్పత్రిలో అడుగుపెట్టాడు. అంతా నిశ్శబ్దంగా ఉంది. అప్పుడప్పుడే కొంతమంది నిద్రనుంచి లేస్తున్నారు. నర్సులు అక్కడక్కడ కనిపిస్తున్నారు.

దూరంగా ఉన్న రమ మంచంకేసి చూశాడు నడుస్తూనే. రమ మంచందగ్గర

డాక్టర్లు నర్సులు గుమిగూడి ఉన్నారు. ఏం జరిగిందోనని గబగబా పరిగెత్తు కుంటూ వెళ్ళాడు. నర్సులు అడ్డం తొల గగా మంచంమీద పిల్లకేసి చూశాడు. నిశ్చింతగా నిద్రపోతోంది. సుధని లేవ తీస్తున్నారు. ముఖం పైకెత్తి 'ఏమయిం' దని అడిగాడు డాక్టరు నుద్దేశించి. డాక్టరు మాట్లాడకుండా తల వంచు కొన్నాడు. నర్సులకేసి చూశాడు. వాళ్లు కూడా తల వంచుకొన్నారు.

డాక్టరు తల వంచుకొనే సమాధానం చెప్పాడు. 'కృష్ణమూర్తి గారూ— అయామ్ వెరీ సారీ. పిల్ల రాత్రంతా చాలా బాధపడింది. ఆ పిల్ల పడిన బాధ చూడనేరక తల్లి తల్లడిల్లిపోయింది. మేము మాత్రం మా శాయశక్తులా ప్రయ త్నించాము. కాని పిల్లని దక్కించలేకపో యాము, ఆ వార్త వినగానే ఒక్కగావు కేక పెట్టి ఆవిడ పడిపోయింది. ఆవిడ పరి స్థితికూడా ఏమీ బాగులేదు' అని ఆగాడు.

తన పిల్ల ఏమయింది. కాదు—కాదు, బ్రతికేఉంది. ఎవరికోసం జీవచ్ఛవంలా పరాయి దేశాల్లో ఉంటూ ఎన్నెన్ని కలలు కన్నాడో—ఆ రమ—ఎవరు పిలి చినా పలకకుండా—ఎవరు లేపినా లేవ కుండా శాశ్వతంగా నిద్రపోతోంది. ఇంక సుధ విషయం—ఆమె తన ప్రాణాలన్నీ ఆ పిల్లమీద పెట్టుకొని ఆ పిల్లకోసం తన సర్వస్వం ధారపోయటానికి సిద్ధ మయింది.

రమ శవంమీదపడి ఏడుస్తూన్న తనని మెల్లిగా లేవతీసి—రమ శవాన్ని వేరేచోట పడుక్కోబెట్టారు. ఆ శవం దగ్గరే కూర్చొని వెక్కి వెక్కి ఏడుస్తు న్నాడు తను.


కొంత సేపటికి డాక్టరు వచ్చి తనని మెల్లిగా తట్టి 'కృష్ణమూర్తి గారూ— మీకు వచ్చిన ఆపదలకు మే మెంతో చింతిస్తున్నాము. డాక్టర్ల మయియుండి కూడా మేము చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయినందుకు మేము కుమిలిపోతు న్నాము కనీసం..'అని అంటూండే తల పైకెత్తి డాక్టరు ముఖంలోకి చూశాడు.

కంటినీరు తుడుచుకొంటున్నాడు డాక్టరు తనకి తెలిసున్నంతవరకు ఆసు పత్రిలో చనిపోయినవారి గురించి కంట తడిపెట్టిన డాక్టరుని చూడలేదు. తన బాధలుకూడా డాక్టర్లని కలచివేస్తున్నాయి కదా అనుకొని మాట్లాడకుండా డాక్టరు కేసే చూస్తున్నాడు.

డాక్టరు మళ్ళీ మొదలుపెట్టాడు 'కానీ ఆవిడ ప్రాణాలయినా కాపాడుదామని ప్రయత్నించాము కాని లాభం లేక పోయింది.'

'అంటే' అని గబగబా లేచాడు. 'సుధ కేమయింది? ఎక్కడ ఉంది?' అంటూ ప్రశ్నించాడు.

డాకరు వెనుదిరిగి చూశాడు. ట్రాలీ మీద ఎవరినో తీసుకువస్తున్నారు. ఆ ట్రాలీకేసే చూస్తున్నాడు.



'ఏమండీ డాక్టర్. సుధకి' అంటూండగానే ట్రాలీ దగ్గరకి వచ్చింది. డాక్టరు ట్రాలీమీద ఉన్న శరీరంపయిన ఉన్న బట్టని ముఖంమీదనుంచి తొలగించాడు.

ఎవరూ ? సుధ! తన సుధ. డాక్టరు–నర్సులు రెప్పలు వాల్చకుండా ఆ ముఖం కేసే చూస్తున్నారు. దగ్గరగా వెళ్ళాడు.

సుధనికూడా రమప్రక్కన పడుకోబెట్టారు. తల్లీ పిల్ల అనుకున్నాడు. రమ దగ్గరగా వెళ్ళి ఆఖరిసారి తనివితీరా ముద్దు పెట్టుకొన్నాడు. సుధప్రక్కగా వెళ్లాడు – సుధ – తన సుధ. ఇంక మాట్లాడదు. అవును, ఎందుకు మాట్లాడుతుంది. ఎప్పుడైతే తను రమను పోగొట్టుకుందో ఇంక తనిక్కడ ఉండి లాభం లేదనుకొని తను కూడా రమతో –

సుధ ముఖాన్ని పరిశీలనగా చూస్తున్నాడు. తనని ఆప్యాయంగా పిలిచే సుధ అని అనుకుంటూండగా – దూరంనుంచి 'బావా!' అని ఆప్యాయంగా సుధ పిలుపు వినిపించింది.

ఇంతలో దూరంనుంచి గబగబా వస్తున్న ముసలాళ్ళని చూశాడు. వాళ్ళతో ఏదో చెపదామనుకొని లేచిన తనని 'బావా!' అని మధురాతి మధురంగా ఆప్యాయంగా మళ్ళీ సుధ పిలుపు వినిపించింది. ఆ పిలుపుకు ముసలాళ్ళు వస్తున్న వైపుకి పరిగెత్తాడు – పిలుస్తూన్నా వారికేసి చూడకుండా పోతున్నాడు. ఆసుపత్రి దాటుతూ 'వస్తున్నా–నేనుకూడా వస్తున్నా–ఆగండి' అంటూ కేకలు వేసుకొంటూ పరుగెత్తుతున్నా డెక్కడికో ......